# 'రోజుకు ఒక వార్డు' తనిఖీ..

**-జగద్గిరిగుటలో కమిషనర్ సృజన క్షేత్రస్థాయి పర్యటన**
**-కాలనీవాసులతో మాటామంతి...**
**స్థానిక సమస్యలపై చర్చ**



స్థానికులతో సమావేశమైన సిఎంసి కమిషనర్ సృజన

**హైదరాబాద్, జూన్ 1,ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి.సృజన చేపట్టిన "రోజుకు ఒక వార్డు" ముమ్మరంగా కొనసాగుతుంది. కమిషనర్ సృజన అధికారులతో కలిసి రోజుకోవార్డులో పర్యటిస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కుత్బుల్లాపూర్ జోన్ చింతల్ సర్కిల్ – జగద్గిరిగుట్ట వార్డులో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులతో ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే వార్డులోని మౌలిక వసతులు, సేవల అమలు పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా హెచ్ఎంటీ కాలనీలో దోమల నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని, పైప్‌లైన్ రోడ్డుపై అనధికారికంగా చెత్త వేయడాన్ని అరికట్టాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. కోరారు. చెత్త సేకరణ వ్యవస్థను మెరుగుపరచడం, ఆలయ ప్రాంగణాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు. అలాగే వాంబే కాలనీ, రాజీవ్ గృహకల్ప, రాజీవ్ గాంధీ నగర్, సోమయ్య నగర్ జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి, మరమ్మతులు చేపట్టాలని నివాసితులు కోరారు. అదనంగా బీరప్ప నగర్‌లో ఫుట్‌పాత్ నిర్మాణం, జగద్గిరిగుట్టలో బాక్స్ కల్వర్ట్ నిర్మాణం, పైప్‌లైన్ రోడ్డుకు సమీపంలో మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీ తాగునీటి సౌకర్యాలు సోమయ్య నగర్, రాజీవ్ గృహకల్ప మరియు జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు, నీరు నిల్వ ఉండడం వంటి అంశాలు ప్రస్తావించారు. వాంబే కాలనీలో అదనపు తాగునీటి సౌకర్యాల కోసం ఓవర్‌హెడ్ స్టోరేజ్ ట్యాంక్ ,పబ్లిక్ ట్యాప్స్ ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా పార్కింగ్ సమస్యలు, ఆక్రమణల తొలగించి జగద్గిరిగుట్ట రోడ్డుపై రహదారి భద్రత మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా అన్ని అంశాలను సంబంధిత శాఖలు పరిశీలించి, పరస్పర సమన్వ యంతో ప్రాధాన్యత ఆధారంగా పరిష్కార మార్గాలు చేపట్టాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా నిర్ణీత కాలపరిమితిలో చర్యలు తీసుకుని పురోగతి నివేదికలను సమర్పించాలని అధికారులకు సూచించారు.

హైదరాబాద్ వార్త



# వరద ముంపు లేకుండా ఐటి కారిడార్

**-15రోజులలో సమస్యలు పరిష్కారానికి ప్రణాళిక**
**-అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి**
**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**



హైడ్రా-సిఎంసి సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్ సృజన తదితరులు

**హైదరాబాద్, జూన్ 1,ప్రభాతవార్త:** ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్‌కు వరద ముప్పు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుందామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. వర్షాకాలంలో రహదారులపై ఏమాత్రం నీరు నిలిచినా తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ఈనేపథ్యంలో సోమవారం వర్షాకాల సన్నద్ధతపై సిఎంసి కమిషనర్ సృజనతో కలిసి సంయుక్తంగా సమీక్షించారు. సిఎంసి పరిధిలో మొత్తం 202 వాటర్ లాగింగ్ పాయింట్లుంటే అందులో 83 మేజర్, 95 మీడియం, 24 మైనర్ ప్రాబ్లం ఉన్న ప్రాంతాలుగా గుర్తించామన్నారు. 15 రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే సంబంధిత శాఖల అనుమతుల కోసం లేఖలు రాస్తామని సరిపుచ్చవద్దని ఆ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వరద కాలువల్లో పూడికను తొలగించే పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గాలి వానకు పడిపోయే ప్రమాదమున్న చెట్లను ముందుగానే గుర్తించి గ్రూమిగ్ చేయాలన్నారు. మ్యాన్‌హోల్స్ మూతలు ఎక్కడ ఉన్నాయనేది స్పష్టంగా అర్థమయ్యేలా మ్యాపింగ్ చేయాలని..ఎస్ఎంఎస్ అలర్ట్స్ ద్వారా భారీ వర్షాల సమాచారాన్ని ,వరద ముప్పు ఉన్న దారుల గురించి.. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడం చేయాలన్నారు. అంతకు ముందు మేజర్ వాటర్‌లాగింగ్ పాయింట్లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హైడ్రా అదనపు కమిషనర్ వర్ల పాపయ్య వివరించారు. అలాగే మెట్ టీమ్స్, డీఆర్ ఎఫ్ బృందాల పనితీరును తెలిపారు

**30 చెరువులకు స్లూయజ్ గేట్లు...**

సీఎంసీ పరిధిలో వరద నీరు పెద్దమొత్తంలో చేరే దుర్గం చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువు ఇలా 30 చెరువులున్నాయని.. వీటికి స్లూయజ్ గేట్లను ఏర్పాటు చేయాల్సిన వసరముందని తెలిపారు. చెరువులను ఖాళీ చేసి ఉంచితే వర్షం నీరు సాఫీగా చేరి వరద పోటెత్తే ప్రమాదం తగ్గుతుందని అన్నారు. ఆర్‌యూబీల వద్ద ఏర్పాటు చేసిన పంపులు పని చేస్తున్నాయా లేదా.. వంతెనలపైన పడిన వర్షం నీరు రంధ్రాల ద్వారా కిందకు వెళ్తుందా లేదా చెక్ చేసుకోవాలని సూచించారు. జూన్ 8వ తేదీనాటికి వర్షాలు ఆరంభమయ్యే పరిస్థితులున్నాయని.. ఈఏడాది తక్కువ వర్షాలున్నా.. పడినప్పుడు కుంభవృష్టి ఉంటుందని హెచ్చరించారు. అన్ని శాఖలతో హైడ్రా సమన్వయంగా పని చేసి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎక్కడైనా ఇబ్బందులంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వర్షాకాలం తలెత్తే ట్రాఫిక్ సమస్యలను ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి అడిషనల్ డీసీపీ హనుమంతరావు వివరించారు.

# కార్మికుల సమస్యలు త్వరలోనే పరిష్కారం

**-ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు : కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**



అధికారులకు సూచనలు ఇస్తున్న కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త :** పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలు, అనధికార కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.సోమవారం నాచారం సావర్కర్ నగర్, ఎస్టీపీ రోడ్, తిరుమల రెసిడెన్సీ, ఎన్టీఆర్ నగర్, చెర్లపల్లి తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. సావర్కర్ నగర్‌లో యాంటీ లార్వల్ ఆపరేషన్లను పరిశీలించిన కమిషనర్, దోమల వ్యాప్తి నివారణకు మరింత ముమ్మర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నాచారం ఎస్టీపీ రోడ్ కారిడార్‌ను తనిఖీ చేసిన ఆయన, రహదారి పక్కన ఉన్న ఆక్రమణలు, స్క్రాప్ నిల్వలు, వీధి వ్యాపారాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే అనధికార అడ్డంకులను వెంటనే తొలగించాలని, రహదారుల పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని సూచించారు.తిరుమల రెసిడెన్సీ ప్రాంతంలో నిల్వ నీటి సమస్యను పరిశీలించిన కమిషనర్, ప్రజారోగ్యానికి ముప్పు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎన్టీఆర్ నగర్, చెర్లపల్లి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూజీ కార్మికులతో సమావేశమైన ఆయన, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. అవసరమైన సౌకర్యాలు కల్పించి పారిశుద్ధ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.చెర్లపల్లిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను సందర్శించిన కమిషనర్, మున్సిపల్ వాహనాల ఇంధన సరఫరా ఏర్పాట్లను సమీక్షించారు. ఇంధన బిల్లుల ప్రాసెసింగ్‌లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మున్సిపల్ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**గుర్రంగూడ ఫారెస్ట్‌లో కాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక .....**

గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు, పర్యావరణ కాలుష్యం, వరద ముప్పు నివారణకు సంబంధించి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హస్తినాపురం, శ్రీపురం కాలనీ, వినూత్న ఎన్‌క్లేవ్, గాంధీనగర్, పద్మావతి కాలనీ, సమానగర్ తదితర ప్రాంతాల్లో ఆరు కీలక డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఏవియేషన్ అకాడమీ నుంచి సాగర్ రోడ్ కల్వర్ట్ వరకు కొత్త మురుగునీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నారు.ప్రధాన రహదారుల వెంట వీధి దీపాల ఏర్పాటు, కాప్రా చెరువు అవుట్‌లెట్ అభివృద్ధి, బాక్స్ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం, రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దుల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.వర్షాకాలానికి ముందే అన్ని శాఖలు సమన్వయంతో పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

# జూపార్కులో మొక్కలు నాటే కార్యక్రమం




జూపార్కులో మొక్కలు నాటుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాన ఎన్.క్షితిజ

**చార్మినార్,జూన్ 1 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కారక్రమంలో భాగంగా హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది.తెలంగాణ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్‌లైఫ్) ఎన్.క్షతిజ జూ పార్కులో మొక్కలు నాటారు.జూ పార్కులోని చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు.యాభై మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జూ పార్కు క్యూరేటర్ జె.వసంత, డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్,జూపార్కు వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎ హకీం, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.శ్రీవాస్‌రెడ్డి,పిఆర్‌ఓ ఎంఎ హనీఫ్,జెడ్ఈఓ సి.హెచ్.దీపక్ తరుణ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పూజ గదిలో దీపం... అపార్ట్‌మెంట్‌లో మంటలు

**-మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది..తప్పిన పెనుప్రమాదం**



**అత్తాపూర్ జూన్1 ,ప్రభాతవార్త :** హైదరగూడలోని జనప్రియ మార్వెల్ అపార్ట్‌మెంట్‌లో ఓ ప్లాట్ అగ్నిప్రమాదం సంభవించిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సోమవారం జనప్రియ మార్వెల్ అపార్ట్‌మెంట్ మూడో ఫ్లోర్‌లో తాళం వేసి ఉన్న ఓ ప్లాట్‌లో ఆకస్మాత్తు మంటలు చేలరేగి పొగలు కలుముకున్నాయి.దీంతో పక్క ప్లాట్‌ల నివాసితులు భయాందోళనకు గురై కిందకు పరుగులు తీశారు. పోలీసులు,అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.ప్రమాదం జరిగిన సమయంలో ప్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.ఫైర్ ఎస్ఐ చంద్రానాయక్ మాట్లాడుతూ..అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులోని ప్లాట్ నెంబర్ 305లో సందీప్,రేఖ దంపతులు నివాసం ఉంటున్నారని ప్రతి రోజులాగే ఉదయం పూజ గదిలో దీపం వెలిగించి ఉద్యోగాలకు వెళ్లాగా ప్రమాదవశాత్తు దీపం కారణంగా మంటలు చెలరేగి పూజ గది,కిచెన్ పూర్తిగా దగ్ధమైయ్యాయని,ప్లాట్‌లోని ఇతర గదులు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయని తెలిపారు.ఈ ప్రమాదంతో ఆస్తి నష్టం సంభవించిందని ఇంట్లోని పలు పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు.ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు

**-అంత్యంత ప్రాధాన్యతతో సత్వరమే పరిష్కరించాలి -అధికారులకు కలెక్టర్ ప్రియాంక అలా ఆదేశం**



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**హైదరాబాద్, జూన్ 1,ప్రభాతవార్త:** ప్రజావాణిలో ప్రజలు అందచేసిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత సత్వరమే పరిష్కరించాలని వాటిని పెండింగ్ పెట్టొద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తి, ఇంచార్జ్ డిఆర్ఓ శ్రీధర్ లతో కలిసి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందచేసిన దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించాలన్నారు. అలాగే జిల్లాలో రెండు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అక్కడ కూడా అందచేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సి.ఎం ప్రజావాణి, శాఖల వారీగా ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షిస్తూ పెండింగ్‌కు గల కారణాలను ఏటీఆర్ ద్వారా తెలియచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 1102అందాయని అందులో హౌసింగ్ శాఖ కు సంబంధించి 902 అర్జీలు, పింఛన్లు 155, రెవిన్యూ శాఖ 14, అలాగే ఇతర శాఖలు 31 అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం పరిశ్రమలు పవన్ కుమార్, డిఎంహెచ్ ఓ డాక్టర్ వెంకటి, జిల్లా సంక్షేమ అధికారులు జి. ఆశన్న, కోటాజి, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, ఏవో విజయలక్ష్మి,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తెలంగాణ ప్రజాకళారూపాల ప్రదర్శన




బాలసాహిత్య గోష్ఠిలో పాల్గొన్న సాహితీవేత్తలతో గరిపల్లి అశోక్, నరసింహారెడ్డి తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజాకళ పేరున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నిర్వహణలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) ఆరుబయలు కళామందిరంలో ఏప్రిల్ 1నుండి నిర్విరామంగా జరుగుతున్న 99రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగం 62వ రోజు సోమవారం రాత్రి మహిళా వారోత్సవాల సందర్భంగా గడ్డం శ్యామల నిర్వహణలో 21మంది ప్రముఖ కవయిత్రుల కవిసమ్మేళనం, తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని గరిపల్లి అశోక్ నిర్వహణలో బాలసాహిత్య గోష్ఠి ఎంతో ఆసిక్తకరంగా స్ఫూర్తిదాయకంగా జరిగాయి. ఈ సందర్భంగా డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ అధ్యక్షురాలు కల్వ సుజాతలతో కలిసి కవితాక్షరి కవితా సంపుటిని ఆవిష్కరించి, కవిసమ్మేళనంలో కవితాగానం చేసిన కవయిత్రులను ఘనంగా సత్కరించారు. ఈరోజు రాత్రి 6.30గంటల నుండి సాగిన బాలసాహిత్య గోష్ఠిలో సైన్స్ ఫిక్షన్/కథలు డా. వి.ఆర్.శర్మ, కథ/నవల పైడిమర్రి రామకృష్ణ, నాటిక/నాటకాలు డా. సమ్మెట విజయ, పుస్తక సమీక్ష డా. అమ్మిన శ్రీనివాసరాజు, శతకపద్యం/గేయం ఉండ్రాళ్ల రాజేశం, బాలల రచనలు పురిమళ్ల సునందలు పాల్గొని ఆయా అంశాలపై మాట్లాడారు. విద్యానందచారి వ్యాఖ్యానంలో సాంస్కృతిక సారధి కళాకారులు శోభారాణి, కృష్ణ, లలిత తదితరులు జానపదగీతాలతో అలరించారు. చివరిగా గోష్ఠిలో పాల్గొన్న సాహిత్యవేత్తలను డా. ఏనుగు నరసింహారెడ్డి ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకొని 2వ తేదీ మంగళవారం రాత్రి 6గంటల నుండి రాయారావు సూర్యప్రకాష్‌రావు నిర్వహణలో 25మంది ప్రముఖ కవులతో కవిసమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్రా భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.వాణిప్రసాద్‌లు తెలిపారు.

# బంజారాహిల్స్‌లో స్నేహితుల మధ్య ఘర్షణ..ఒకరి మృతి

**- నిందితుల్లో బంజారాహిల్స్ రౌడీషీటర్**

**జూబ్లీహిల్స్, జూన్ 1, ప్రభాతవార్తః** బంజారాహిల్స్‌లో స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతిచెందిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని హయత్ ప్యాలెస్ సమీపంలో అహ్మద్ హుస్సేన్, ఖలీద్, సయ్యద్ జావీద్, హైదర్ షరీఫ్ అలియాస్ మహ్మద్ ఖలీ, అజర్, మతీన్ తదితరులు కలిసి మద్యం సేవిస్తున్నారు. ఈ సమయంలో అహ్మద్ హుస్సేన్, మహ్మద్ ఇమ్రాన్ మధ్య చిన్న విషయంపై వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. దీంతో కోపోద్రిక్తుడైన అహ్మద్ హుస్సేన్ ఇమ్రాన్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో ఇమ్రాన్ అపస్మారక స్థితికి చేరుకోగా, తోటి స్నేహితులు అతన్ని వెంటనే మహావీర్ ఆసుపత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు ఇమ్రాన్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడిది బండ్లగూడ ప్రాంతానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. అతను ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అహ్మద్ హుస్సేన్ బంజారాహిల్స్ రౌడీషీటర్‌గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# 19 నుంచి టిటిడి వేంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు

**భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ బిఆర్‌నాయుడు**




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు. చిత్రంలో యు.రమేష్, శంకర్‌గౌడ్ తదితరులు

**సైఫాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** హిమాయత్ నగర్‌లోని టిటిడి బాలాజీ భవన్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం 21వ వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అంగరంగ వైభవంగా అత్యంత కన్నుల పండువగా నిర్వహిస్తున్నామని టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఈ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రికను టిటిడి ఎఈవో యు.రమేష్, దేవాలయం లోకల్ ఎడ్వైయిజరీ కమిటీ అధ్యక్షుడు శంకర్‌గౌడ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బ్రహోత్సవాలు సందర్భంగా 19వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 8.45 వరకు దేవాలయంలో వార్షిక బ్రహోత్సవాలకు సంబంధించి అంకురార్పణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం స్వామివారికి సుప్రభాతం, సర్వ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవ, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే ధ్వజారోహణ, శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని శేష వాహనం, హనుమంత వాహనం, గజ వాహనం, శాంతి కళ్యాణం, గరుడ వాహనం, సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, అలాగే రథోత్సవం పురువీధుల్లో కొనసాగుతాయని ఆయన వివరించారు. ప్రతి రోజు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణతోపాటు ఉదయం అల్పహారం, రెండు పూటల అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన వివరించారు. ఈ బ్రహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆయ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో దేవాలయం వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస మణికంఠ, వేదపండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## పిసిబి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాలు


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పిసిబి అధికారులు.

**జూబ్లీహిల్స్, జూన్ 1, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వమించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతంచేద్దామనే నినాదంతో, అంశంతో ఈ సారి ఈ వేడుకలను నిర్వహించారు. చిత్రలేఖన పోటీలో దాదాపు 150 మందికిపైగా విద్యార్థులు, 50 మంది విద్యార్థులు పాటల పోటీలో పాల్గొన్నారు. అలాగే అయిదు గ్రూపులతో వంద మంది విద్యార్థులు స్కిట్‌లో, మరో అయిదు గ్రూపులు నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే దుష్పరిణామాలను, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు తదితర అంశాలపై వీరంతా తమ ప్రతిభను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పిసిబి సభ్య కార్యదర్శి జి. రవి అన్నారు. చిన్నారుల్లో ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన విజేతలకు ధృవీకరణ పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీనియర్ సాంఘీక శాస్త్రవేత్త డాక్టర్ జి. ప్రసన్నకుమార్, ప్రాజెక్ట్ అధికారి టి. రాధిక, కో -ఆర్డినేటర్లు సౌమ్య, పూర్వి, రాజేష్, పీసిబి అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బుచ్చిబాబు సాహిత్యం సమాజానికి దిక్సూచి

**-హాస్యావధాని, కళారత్న డాక్టర్ శంకర్ నారాయణ**


ప్రసంగిస్తున్న హాస్యావధాని, కళారత్న డాక్టర్ శంకర్ నారాయణ

**చిక్కడపల్లి జూన్ 1, ప్రభాతవార్త :** తెలుగు సాహితీ లోకానికి బుచ్చిబాబు చేసిన సేవలు అనన్యసామాన్యమైనవని సీనియర్ పాత్రికేయులు, హాస్యావధాని, కళారత్న డాక్టర్ శంకర్ నారాయణ అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా ప్రముఖ నవలాకారుడు, నాటకకర్త, కథకుడు బుచ్చిబాబు యాదిలో సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళావేదిక లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శంకరనారాయణ మాట్లాడుతూ బుచ్చిబాబు చేసిన రచనలు, నాటకాలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలుగు నవలా సాహిత్యంలో సరికొత్త విప్లవాన్ని తెచ్చిన మహోన్నత రచయిత బుచ్చిబాబు అని, మానవ మనస్తత్వాలను, అంతర్మథనాలను ఆయన తన రచనల్లో ఆవిష్కరించిన తీరు అద్భుతం అని అన్నారు. ఆయన రాసిన చివరకు మిగిలేది నవల తెలుగు సాహిత్య చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. పాత్రికేయుడిగా, రచయితగా ఆయన సమాజానికి అందించిన సందేశం ఎప్పటికీ సజీవంగా ఉంటుందన్నారు. సాహితీవేత్త శైలజామిత్ర, గాయని పేరి అన్నపూర్ణ, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జులైలో 'ముంబై రైజింగ్ స్టార్ అవార్డ్స్-2026'


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైతన్య, విజయ్‌వర్మ తదితరులు

**సైఫాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** నూతన నటినటులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఏడాది జులై మాసంలో ముంబై మహానగరంలో 'ముంబై రైజింగ్ స్టార్ అవార్డ్స్-2026' పేరిట ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి-ఇండియా) తెలిపింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కౌన్సిల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగా చైతన్య, పాకాలపాటి విజయ్‌వర్మ, ప్రముఖ దర్శకులు వీరభద్రచౌదరి, బాలీవుడ్ నటిమణులు ప్రతిమ మౌర్య, సెజల్ , స్నేహ అగర్వాల్ శర్బరిదాస్ తదితరులు ఈ అవార్డ్స్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైతన్య, విజయ్‌వర్మ మాట్లాడుతూ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చలనచిత్ర అభివృద్ధికి తోడ్పడే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం సినీ రంగంలో అడుగుపెట్టి తమ ప్రతిభను చాటుకుంటున్న నటినటులు, సాంకేతిక నిపుణులను గుర్తించి ముంబై రైజింగ్ స్టార్ అవార్డ్స్ ద్వారా సత్కరిస్తున్నామని వివరించారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి


ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న పాలభిందెల శ్రీనివాస్

**నిజాంపేట్, జూన్ 1, ప్రభాతవార్త**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు నెలకు కనీస వేతనంగా రూ.26,000 చెల్లించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రధాని నుంచి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వరకు పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ వారి సంక్షేమం కోసం అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపల్ కార్మికులకు రెండో పీఆర్సీ అమలు చేసి కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని కోరారు.కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పండుగ సెలవులు, వారాంతపు సెలవులు, ఇతర చెల్లింపు సెలవులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, జి. శివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం శాంతి ర్యాలీ

**- 22న హైదరాబాద్‌లో 2 లక్షల మందితో క్రిస్టియన్ జాతర**


ప్రసంగిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొనే సోలమన్ రాజ్,

**చిక్కడపల్లి జూన్ 1, ప్రభాతవార్త :** దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాలు జాబితాలో చేర్చి, వారికి రావాల్సిన రాజ్యాంగబద్ధమైన హక్కులను, ఎస్సీ హోదాను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీ లో తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొనే సోలమన్ రాజ్, ట్రెజరర్ సి. బెనోని రిచర్డ్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ జయకుమార్ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల సమస్యల సాధన మరియు ఇతర ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం జూలై 22 న హైదరాబాద్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా సీజే క్రిస్టియన్ జాతర సభను నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులందరినీ చైతన్యపరుస్తూ నిర్వహించబోయే ఈ భారీ బహిరంగ సభకు సుమారు 2 లక్షల మంది క్రైస్తవులు హాజరవుతారని వారు వెల్లడించారు. ఈ జాతరను విజయవంతం చేయడం ద్వారా మన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎమ్. జాన్ విల్సన్ నేతృత్వం వహించారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా , రోమన్ క్యాథలిక్ చర్చ్ , హెబ్రోన్, బాప్టిస్ట్, పెంతెకోస్తు , ఇండిపెండెంట్ చర్చిల ప్రతినిధులు, విశ్వాసులు ఇందులో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాలోని 23 మండలాలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు, మహిళలు, యువతతో కలిపి సుమారు 1,500 మందికి పైగా ఈ ర్యాలీలో పాల్గొని దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ పాస్టర్ సోలమన్, పాస్టర్ పగడపల్లి జేమ్స్, ట్రెజరర్ పాస్టర్ సదానందం, టీయూ సి పి ఏ సభ్యులు భాస్కర్ నాయక్, గంగవరపు సోలమన్, పల్లా రాజశేఖర్ మరియు స్థానిక క్రైస్తవ ప్రముఖులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో సన్నాయి వాయిద్య కళాకారులకు అన్యాయం : వేముల శ్రీనివాస్


దేవాదాయ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సన్నాయి కుల వాయిద్యా కళాకారులు

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త**

దేవాలయాల్లో వాయిద్య కళాకారుల ఉద్యోగాల భర్తీలో తెలంగాణకు చెందిన సన్నాయి కుల వాయిద్య కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాయిద్య కళాకారులకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వడం అన్యాయమని తెలంగాణ సొన్నాయి కుల వాయిద్య కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోమండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వకుండా కాలేశ్వరం తదితర దేవాలయాలలో వాయిద్య కళాకారుల నియామకానికి ఇచ్చిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేయడం, కొండగట్టు గుడి ఏర్పాటు నుంచి ఇప్పటివరకు పనిచేస్తున్న వాయిద్య కళాకారులను కాకుండా ఇతర కళాకారుల నియామకాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సన్నాయి కుల వాయిద్య కారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు సన్నాయి వాయిద్యాలతో వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తెలంగాణలోని దేవాలయాల్లో తమ కులస్థులకు జరుగుతున్న అన్యాయం, అధికారుల వైఖరిని నిరసిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ డి.కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వేముల శ్రీనివాస్, కోమండ్ల మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో గత వందల ఏళ్లుగా దేవాలయాల్లో సన్నాయి వృత్తితో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. చాలీచాలనీ జీతభత్యాలతో దేవాలయాల్లో పురాతన ఆచార పద్ధతిలో భగవంతుడి మేలుకొలుపు, పవళింపు సేవలు సన్నాయి వాయిద్యాలతో చేస్తున్నామన్నారు. దేవాదాయశాఖ అధికారులు దేవాలయాల్లో వాయిద్య కళాకారుల ఉద్యోగాల భర్తీ కోసం సంబంధిత కోర్సు (డిప్లొమా సర్టిఫికేట్లు) కావాలంటూ మెలిక పెడుతూ, ఆంధ్ర వాయిద్య కళాకారులను నియమిస్తూ సన్నాయి కులస్థులను కనుమరుగయ్యేలా చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో శుభకార్యాలు, అశుభకార్యాల వరకు అవసరమైన వాయిద్యలను నిర్వహిస్తున్న వాయిద్య కళాకారులకు దేవాలయాలలో నియమించేందుకు ప్రాధాన్యతను ఇచ్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం నేతలు కోమాండ్ల మహేందర్, మహాదేవుని శంకర్, దేవుని చంద్రమోళి, మెట్టుపల్లి గంగారాం, సుధీర్, మధుకర్, రవి కోరుట్ల, సిద్ధి రమేష్, కొమాండ్ల సత్యనారాయణ, కొండగట్టు అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్లు ధరించాలి : పోలీస్ కమిషనర్ సుమతి


సికింద్రాబాద్ సంఘీత్ చౌరస్తాలో బారీ హెల్మెట్ శిల్పావిష్కరణ చేస్తున్న పోలీస్ కమిషనర్ సుమతి

**కంటోన్మెంట్, జూన్ 1 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా, తల గాయాల నివారణ, ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు బారీ ప్రధాన చౌరస్తాల్లో బారీ హెల్మెట్ శిల్పాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి, మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ టీ.వినేయ్ క్రిష్ణారెడ్డిలు తెలిపారు. సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సంగీత్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన బారీ హెల్మెట్ శిల్పావిష్కరణను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతలను దృష్టిలో ఉంచుకొని ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాణ్యమైన హెల్మెట్‌ను ధరించి ప్రణాలను కాపాడుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకుగాయా లైతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు వినూత్నంగా ఏర్పాటు చేసిన బారీ హెల్మెట్ శిల్పాన్ని ప్రయాణికుల్లో చైతన్యం తెచ్చేందుకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి, మెడికవర్ ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ రమేష్,డాక్టర్ బాలసుబ్రమణ్యం, సెంటర్ హెడ్,క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభమైన శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం

**చిక్కడపల్లి, జూన్ 1 (ప్రభాతవార్త ):** చిక్కడపల్లి వివేకనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞము వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా ప్రారంభమైంది. ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన కార్యక్రమం 7వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ బృహత్ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరగనుంది. యజ్ఞం ప్రారంభమైన మొదటి రోజైన సోమవారం ఉదయం 8 గంటల నుండి ఆలయ అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాళ వేంకటాద్రి నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమత్ సుందరకాండ హోమము పూర్తి చేసి, మంగళహారతి, మంత్రపుష్పము సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### జలమండలి కార్మికుల సంక్షేమమే లక్ష్యం : రాజిరెడ్డి



**కుత్బుల్లాపూర్, జూన్ 1, ప్రభాతవార్త**

6న జరగనున్న జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (టీజేఈయూ) త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించా లని యూనియన్ అధ్యక్ష అభ్యర్థి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి కార్మికులకు విజ్ఞప్తి చేశారు.సోమవారం కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో ఉద్యోగులు, కార్మికులను కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జూన్ 6న జరిగే ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి టీజేఈయూను విజయతీరాలకు చేర్చాలని మొగుళ్ల రాజిరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి. చంద్రశేఖర్, వై. నాగన్న గౌడ్, నాయకులు నల్ల సంజీవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చలపతి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె. రాజిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్ బి. కిషోర్ కుమార్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ మహిళా నాయకురాలు శ్రీదేవి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రవికాంత్ గౌడ్, నాయకులు రిజ్వాన్, గౌస్, హాశం, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఈ. చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో వినతులు స్వీకరించిన డిసి లావణ్య


ప్రజల నుండి వినతులను స్వీకరిస్తున్న దృశ్యం

**కొంపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**

కొంపల్లి సర్కిల్-56 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం మూడు దరఖాస్తులు అందాయి.అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్‌పై చర్యలు తీసుకోవాలని, ఉమా మహేశ్వరి కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, పాండు బస్తీలో మంజూరైన కల్వర్టు పనులను వెంటనే ప్రారంభించాలని స్థానికులు వినతిపత్రాలు సమర్పించారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి : ఎంపి అనిల్‌కుమార్ యాదవ్

**చిక్కడపల్లి జూన్ 1 ( ప్రభాతవార్త ) :** ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ , డీఎల్‌ఏ బూత్ లెవెల్ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ యాదవ్ అధికారులను, పార్టీ శ్రేణులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో ఆయన జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, గాంధీనగర్, రాంనగర్, అడిక్ మెట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బింగి సాయికీర్త్, ఆర్స్ లాన్ హుస్సేన్ , డికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో స్థానికేతరులు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తొలగించాలన్నారు. బూత్ స్థాయిలో ప్రతిరోజూ ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఇందుకు సంబంధించిన ఎస్ఐఆర్ అధికారులకు డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు.

# జలమండలి కార్మికుల ఎన్నికల ప్రచారంలో రాజిరెడ్డి


ప్రచారసభలో మాట్లాడుతున్న మొగుళ్ళ రాజిరెడ్డి

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త**

జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించేది తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ది అని యూనియన్ (టీజేఈయూ) అధ్యక్ష అభ్యర్థి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. కూకట్‌పల్లి, కెపిహెచ్‌బిలోని జలమండలి జోనల్ కార్యాలయంలో సోమవారం జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి, ఉద్యోగ, కార్మికులను మర్యాదపూర్వకంగా కలసి తాను పరిష్కరించిన సమస్యలను వివరిస్తూ టీజేఈయూ త్రిశూలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత టీజేఈయూ రాష్ట్ర ప్రభుత్వం, జలమండలి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి దాదాపు అన్ని సమస్యలను పరిష్కరించమని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి జలమండలి ఉద్యోగ, కార్మికులకు ఆరోగ్య భీమా కార్డులు ఇప్పించే బాధ్యత తనదేనని, జూన్ 6న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ త్రిశూలం గుర్తుకు జలమండలి ఉద్యోగ, కార్మికులు తమ ఓటు వేసి గెలిపించాలని మొగుళ్ళ రాజి రెడ్డి విజ్ఞప్తి చేసారు. ఈ సభలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి. చంద్రశేఖర్, వై. నాగన్న గౌడ్, నేతలు నల్ల సంజీవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చలపతి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె. రాజిరెడ్డి, టి. పి.సి.సి రాష్ట్ర ప్రోటికల్ కో ఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్ బి. కిషోర్ కుమార్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ మహిళా నాయకురాలు శ్రీదేవి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రవికాంత్ గౌడ్, నేతలు వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఈ. చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులూ రమేష్, యూనియన్ నాయకులు రిజ్వాన్, గౌస్, హాశం, రాజిరెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

# మహిళలకు ద్విచక్ర వాహనం డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్, సీఈఓ డాక్టర్ లింబాద్రి తదితరులు

**చిక్కడపల్లి జూన్ 1 ( ప్రభాతవార్త ) :** మహిళల అభివృద్ధి, స్వావలంబన, రక్షణే ధ్యేయంగా బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థలు సోమవారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రముఖ మహిళా సాధికారత సంస్థ మోటార్‌సైకిల్ విమెన్ భాగస్వామ్యంతో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టూవీలర్ డ్రైవింగ్ క్లాసులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ సోమవారం ఘనంగా ప్రారంభించి ప్రసంగిస్తూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలంటే స్వతంత్రంగా ప్రయాణించే సామర్థ్యం ఎంతో అవసరమన్నారు. డ్రైవింగ్ అనేది కేవలం ఒక నైపుణ్యం మాత్రమే కాదని, అది మహిళల ఆత్మవిశ్వాసానికి, స్వయం సమృద్ధికి బాటలు వేసే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. మహిళలకు ప్రాక్టికల్ డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు, ఆత్మవిశ్వాస పెంపు అంశాలపై నిపుణులతో సమగ్ర శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తిచేసిన మహిళలకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తారు. మహిళల్లో సురక్షిత డ్రైవింగ్ నైపుణ్యాలు , రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ప్రజలు తగ్గిన గుణపాఠం చెప్పడం ఖాయం : తలసాని


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,ఈచిత్రంలో మహేందర్ కుమార్,శ్రీనివాస్‌యాదవ్‌లు

**గోషామహల్, జూన్ 1 ప్రభాతవార్త:** ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగ్గిన గుణపాఠం చెప్పడం ఖాయమని మాజీ మంత్రి, శాసనసభ్యులు తలసానిశ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆదర్శనగర్‌లోని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఆర్వీమహేందర్,హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.గోషామహల్ నియోజకవర్గంలోని రెండువందల 35 బూత్‌లకు,బూత్‌కు ఇద్దరు చొప్పున పార్టీ సభ్యత్వ నమోదు తీసుకోవాలని సూచించారు.బూత్ వారికిగా ఉన్న ఓటర్ లిస్ట్‌లో(సర్)పేరిట ఓట్లను తొలగించకుండా చూసుకోవాలన్నారు.ఈనెల 7వ తేదిన గోషామహల్ నియోజకవర్గం డివిజన్ల నాయకులు,బూత్‌స్థాయి నాయకుల సమావేశంతెలంగాణ భవన్‌లో ఉంటుందని ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్‌కుమార్ తెలిపారు.తప్పకుండా సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు. ఈసమావేశంలో పరిశీలకులు నాగేందర్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కలిసి కట్టుగా బూత్ సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమ కారులు పాల్గొన్నారు.

### ఆధ్వాన్నంగా మారిన రహదారులు..పట్టించుకోవడం లేదు..

**బేగంబజార్, జూన్ 1ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో అనేక రహదారులు ఆద్వాన్నంగా మారినట్లు ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎస్.ధన్‌రాజ్‌మాదిగ అన్నారు.సోమవారంప్రజాపాలనలో భాగంగా గోషామహల్ నియోజకవర్గం జిహెచ్ఎంసి డిప్యూటి కమీషనర్ ఉమాప్రకాష్‌కుజాంబాగ్ డివిజన్ రహదారులతోపాటు కనీస సౌకర్యాలు లేవని ఎస్.ధన్‌రాజ్ మాదిగ వినతిపత్రం అందచేశారు.అందుకు ఆమె సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేశారు.జాంబాగ్‌లో అనేక బస్తీలలో రహదారులు గుంతల మయంగా ఉన్నట్లు కాంగ్రెస్ కార్యదర్శి ధన్‌రాజ్ మాదిగ తెలిపారు.లేని పక్షంలో మున్సిపల్ కమీషనర్‌ను కలిసి వినతి పత్రం అందచేస్తామన్నారు.

## ప్రజావాణిలో స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**పేట్ బషీరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త**

జీడిమెట్ల మున్సిపాలిటీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 286వ డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధిలోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ ప్రజల తరఫున స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు కోసం వినతిపత్రం సమర్పించారు.కాలనీలో తగినంత వీధి దీపాలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా నికిత శ్రీనివాస్ రెడ్డి నివాసం సమీపంలో కొత్త స్ట్రీట్‌లైట్ ఏర్పాటు చేయాలని కాలనీ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు కోరారు. అదేవిధంగా కాలనీలో మరో రెండు స్ట్రీట్‌లైట్లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వెలుతురు సౌకర్యం కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అధికారులు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బచ్చా జ్ఞానేశ్వర్, పోగు సమ్మన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో మహిళలపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 1, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ప్రాంతంలో ఇద్దరు మహిళలపై దాడి చేసి వారితో అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురిపై ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. అంబిక తన భర్త ప్రశాంత్‌తో కలిసి ఖైరతాబాద్‌లోని పీఎన్ఆర్ కంఫర్ట్ హోటల్‌లో గత వారం రోజులుగా ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి బేగంపేటలో కుటుంబ కార్యక్రమానికి హాజరై తన బంధువు భవానితో కలిసి హోటల్‌కు తిరిగి వచ్చారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన అగంతకుడు అసభ్య పదజాలంతో మాట్లాడటంతో అంబిక అతన్ని ప్రశ్నించింది. అదే సమయంలో మరో ఇద్దరు అగంతకులు అక్కడికి వచ్చి మహిళలతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ముగ్గురు కలిసి అంబిక, భవానిపై దాడి చేసి కొట్టారు. ఈ క్రమంలో మహిళలు ధరించిన దుస్తులను చింపివేశారు. హోటల్ గదిలో నుంచి ఈ ఘటనను గమనించిన ప్రశాంత్ వారిని అడ్డుకునేందుకు రాగా అతనిపైనా దాడి చేశారు. పెట్రోలింగ్ పోలీసులు, స్థానికుల సహాయంతో బాధితులను రక్షించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనలో అంబికకు, భవానికి గాయాలయ్యాయి. నిందితులను ముదావత్ చిన్న నాయక్, విశ్లావత్ మధు మోహన్ నాయక్, రామావత్ వెంకటేష్ నాయక్‌లుగా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జూబ్లీహిల్స్‌లో బంగారు ఆభరణాల చోరీ

**జూబ్లీహిల్స్, జూన్ 1, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారు ఆభరణాల చోరీ ఘటన చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమండ్రికి చెందిన కోటిపల్లి భారతి తేజస్వి తన కుమార్తె, అమ్మమ్మతో కలిసి బంధువుల వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఏప్రిల్ 27న నగరానికి వచ్చారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45లోని ఒక ఫ్లాట్‌లో బస చేశారు. మే 10న రాత్రి తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను రెండు చిన్న పెట్టెల్లో ట్రాలీ బ్యాగులో పెట్టారు. మే 13న కుటుంబ సభ్యులతో కలిసి బెగంపేట నుంచి రైలులో భీమవరం ప్రయాణించారు. మే 14 ఉదయం భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో ఉన్న తమ అమ్మమ్మ ఇంటికి చేరుకుని ట్రాలీ బ్యాగు తెరిచి చూడగా, బంగారు ఆభరణాలు ఉన్న రెండు పెట్టెలు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు జూబ్లీహిల్స్‌లోని బంధువుల ఇంట్లో చోరీకి పాల్పడి ఉంటారని అనుమానించారు. చోరీకి గురైన ఆభరణాల్లో కాంతె నెక్లెస్, గ్రీన్ స్టోన్ నెక్లెస్, గ్రీన్ స్టోన్ హారం, పూసల హారం, పింక్ పూసల నెక్లెస్, వైట్ స్టోన్ నెక్లెస్, పాపిడి చైన్, గ్రీన్ బీడ్స్ చైన్, బంగారు గాజులు, వైట్ స్టోన్ గాజులు, నల్లపూసల గొలుసులు, చెవిపోగులు, బంగారు చైన్ ఉన్నాయని, రూ. 14.50 లక్షల విలువైన సుమారు 580 గ్రాముల బంగారం చోరీకి గురైందని భీమవరం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్‌గా నమోదు జూబ్లీహిల్స్ ఠాణాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో ఘర్షణ, ఒకరి మృతి

**కంటోన్మెంట్, జూన్ 1 ప్రభాతవార్త:** మద్యం మత్తులో ఇరువురు ఘర్షణ పడి క్షణి కావేశంతో కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేసినసంఘటన మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ మారేడ్‌పల్లి వాల్మీకి నగర్‌లో నివాసం ఉంటున్న పరశరామ్,లక్ష్మిలకు చెందిన శ్రావన్ కుమార్ పాపా (24) ,డెకరేషన్ పనిచేస్తుంటాడు. అతని ఇంటికి ఎదురుగా నివాసంటున్న రామ్‌దాస్ కుమారుడు నిఖీల్ కుమార్ (21) గంజాయి తాగుతూ జులాయిగా తీరుగుతున్నాడు. వీరి ఇద్దరి ఇండ్లు ఎదురెదుగా ఉండడం స్నేహితులైయ్యారు. ఈ నెల 31న ఆదివారం రాత్రి శ్రావన్ బాబాయ్ కుమార్తె (వరుసకు చెల్లెలు)తో నిఖీల్ గొడవ పడ్డాదు తన చెల్లెలితో గొడవ ఎందుకు పడుతున్నావని శ్రావన్ నిఖీల్‌ను నిలదీయడంతో ఇంటి ముందే ఇరువురు గొడవ పడ్డారు. అందరు చూస్తుండగానే నిఖీల్ శ్రావన్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. గాయాలపాలైన శ్రావన్‌ను చికిత్సనిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. శ్రావన్‌పై కత్తితో దాడి చేసి హత్య చేసిన నిఖీల్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఏసీపీ గోపాలక్రిష్ణ మూర్తి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేష్ దర్యాప్తు చేస్తున్నారు.

## నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా సంపత్


పెద్ద అంబర్పేట కార్యాలయంలో భాధ్యతలు స్వీకరిస్తున్న డీసీ సంపత్

**హయత్ నగర్, జూన్ 1 ప్రభాతవార్త :** నాగోల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా ఎ. సంపత్ సోమవారం పెద్ద అంబర్ పేట్ లోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మే 29న డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ రాజును సాధారణ బదిలీలలో భాగంగా వారం తిరగకుండానే ప్రభుత్వం జీహెచ్ఎంసీ కి బదిలీ చేసింది. ఈ క్రమంలో గ్రేడ్ 1 మున్సిపల్ కమిషనర్ సంపత్ ను నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు కనీస సదుపాయలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

## యువ ఫుట్‌బాల్ క్రీడాకారులకు జీపీ ఫాల్గుణ ప్రోత్సాహం



**నేరెడ్ మెట్, జూన్ 1,ప్రభాతవార్త :** రామకృష్ణాపురంలోని రెయిన్‌బో ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్‌ను జీపీ ఫాల్గుణ సందర్శించి యువ క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మైదానానికి వచ్చిన ఆయన ఆటగాళ్లతో మమేకమై వారి ప్రతిభ, శిక్షణ విధానాలపై ఆరా తీశారు. యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీపీ ఫాల్గుణ అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహకరమైన సందేశాలు ఆటగాళ్లు, తల్లిదండ్రులు, కోచ్‌లు మరియు క్లబ్ సభ్యుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని రెయిన్‌బో ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి ఇలాంటి ప్రోత్సాహం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెయిన్‌బో ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి ఎల్. దీనన్ కుమార్ మాట్లాడుతూ, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్‌ను సందర్శించి యువ క్రీడాకారులకు విలువైన సూచనలు అందించిన జీపీ ఫాల్గుణకు క్లబ్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం క్లబ్ సభ్యులు, క్రీడాకారులు మరియు తల్లిదండ్రుల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి : ఎంపి అసదుద్దీన్ ఓవైసీ


ఎంపి అసదుద్దీన్ ఓవైసిని మర్యదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంఐఎం నాయకులు ఆలీం తదితరులు

**మలక్ పేట, జూన్ 1,ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. ఎంఐఎం సీనియర్ నాయకులు ఆలీం మలక్ పేట నుంచి పలువురు నాయకులు కార్యకర్తలతో కలిసి ఎంపి అసదుద్దీన్ ఓవైసీని మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, దాతృత్వం, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రజలందరూ కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడంతో మతసామరస్యం పెంపొందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు: ఎమ్మెల్యే బలాల


లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట, జూన్ 1, ప్రభాతవార్త:** మహిళలకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు అండగా నిలుస్తున్నాయని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. సుమారు 402 మందికి షాది ముబారక్ చెక్కులు, 54 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే బలాల అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ పేద మహిళల వివాహాలకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ మండలం తాహసిల్దార్ నిహారిక, సైదాబాద్ డిప్యూటీ తాహసిల్దార్ కిరణ్ కుమార్, అర్ఐలు మహమ్మద్ యూనస్, అర్చన, శ్రీకాంత్, శేఖర్ లతోపాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రోడ్ల సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంపి ఈటెల రాజేందర్‌కు వినతి సమర్పిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 1 ప్రభాతవార్త:** జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డు సమీపంలోని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి కిందకు వచ్చే కాలనీల సమస్యల పరిష్కారానికి సహకరించాలని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్‌ను తెలంగాణ బిజెపి కో–ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొలన్ శంకర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన పలువురితో కలిసి ఎంపికి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ధాతునగర్ ఆఫీసర్స్ కాలనీ, సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీల్లో రోడ్లు, పార్కులో షెడ్డు తదితర సమస్యలను దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యప్రకాశ్‌సింగ్, సురేష్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, జయకాంత్, దినేష్, కృష్ణ పాల్గొన్నారు.

# జలమండలి అధికారులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమీక్ష


జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 1 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి సరఫరా, నీటి ఒత్తిడి సమస్యలు, కొత్త పైప్‌లైన్‌ల నిర్మాణం, నీటి లీకేజీల నివారణ, మురుగునీటి నిర్వహణ తదితర అంశాలపై సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జలమండలి జీఎం సంతోష్ కుమార్, డిజిఎం సుప్రియ, మేనేజర్లు రవీందర్, కిష్టయ్య, శ్రీవాణి తదితరులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఆయన అధికారుల దృష్టికి తీసుకునివచ్చారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే పాత పైప్‌లైన్‌ల కారణంగా తరచూ ఏర్పడుతున్న లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి సమస్యలు అధికంగా ఉన్న కాలనీలలో ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జలమండలి జీఎం సంతోష్‌కుమార్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, సమస్యల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఎంఎంసి కమిషనర్‌తో పెండింగ్ బిల్లులపై కాంట్రాక్టర్ల ప్రతినిధుల భేటీ

**- డిసెంబర్ వరకు బకాయిల చెల్లింపులకు హామీ**


ఎంఎంసీ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

**తార్నాక, జూన్ 1 ప్రభాతవార్త:** ఎంఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, బడ్జెట్ కేటాయింపులు మరియు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిల అంశాలపై ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మల్కాజిగిరి ప్రతినిధులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లుల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి ఐదు రోజుల సమయం ఇవ్వాలని కోరిన కమిషనర్, డిసెంబర్ నెల వరకు ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపులను క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ అంశంపై మరింత సమగ్రంగా చర్చించేందుకు వచ్చే మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంజనీరింగ్, ఫైనాన్స్ శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. త్వరితగతిన బిల్లుల చెల్లింపులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మల్కాజిగిరి అధ్యక్షుడు ఎం. నరసింహ, ప్రధాన కార్యదర్శి గండికోట ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు శివరాం, రూపాని వెంకన్న, గుర్రం ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నాం : జోనల్ కమిషనర్ సత్యనారాయణ



జోనల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పిస్తున్న రజక సంఘం చైర్మన్ మావురపు నర్సింహ తదితరులు

**మలక్ పేట, జూన్ 1, ప్రభాతవార్త:** ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ యంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కె. సత్యనారాయణ పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ కి చెందిన టౌన్ ప్లానింగ్ సమస్యలపై 01, ఇంజనీరింగ్ సమస్య పై 01 మొత్తం 02 ఫిర్యాదులు అందయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ... జోన్ పరిధిలోని సంతోష్ నగర్, యాకుత్ పురా, మలక్ పేట్, చార్మినార్, మూసారం బాగ్ సర్కిళ్ల కు చెందిన ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఏ యం సీ రాజారావు, యూబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజ, వెటర్నరీ విభాగం సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హమీద్, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ వైఎస్‌ఆర్‌నగర్ డ్రైనేజీ సమస్యను తీరుస్తాం : నవారు మల్లారెడ్డి


డ్రైనేజీ సమస్యలు పరిశీలిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 1 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్‌లోని అల్మాస్‌గూడ వైఎస్‌ఆర్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్‌ఆర్ పార్కు వద్ద డ్రైనేజీ పైపు లైను ధ్వంసం కావడంతో రోడ్లపై పారుతున్న డ్రైనేజీ నీరు కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఆయన స్థానికులతో కలిసి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను ఇటీవల బడంగ్‌పేట్ సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో సంబంధిత ఎఇ హరీష్ డ్రైనేజీ మరమ్మతుల కోసం ఎస్టిమేట్ తయారు చేయించి టెండర్ పెట్టడం జరిగిందని వెల్లడించారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారనీ దీంతో సమస్య తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు సాగేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు ఏవైనా తాము పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని మల్లారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, కుమార్, తిరుమలేష్, శ్రీను, రాజు, లోకేష్, చంటి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి, పోటీని అధిగమించేందుకు క్రమశిక్షణ అవసరం : సైకాలజిస్ట్ రాజ్ ఆచార్య



**నేరెడ్ మెట్, జూన్ 1ప్రభాతవార్త :** సినీ రంగంలో విజయాన్ని అందుకోవాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదని, మానసిక దృఢత్వం, ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ వంటి లక్షణాలు అత్యంత కీలకమని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్, సినీ దర్శకుడు రాజ్ ఆచార్య పేర్కొన్నారు. సినీ రంగ వ్యక్తుల ప్రవర్తనా సరళి, విజయాలుపరాజయాలు, మానసిక ఒత్తిళ్ల మరియు లక్ష్య సాధనపై ఆయన శాస్త్రీయ విశ్లేషణను విడుదల చేశారు. సినీ రంగం బయటకు ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, అంతర్గతంగా తీవ్రమైన పోటీ, అనిశ్చితి, మానసిక ఒత్తిళ్లతో నిండి ఉంటుందని తెలిపారు. ఈ రంగంలో రాణించాలనుకునే వారు తమ కంఫర్ట్ జోన్‌ను విడిచిపెట్టి కష్టపడే మనస్తత్వాన్ని అలవరచుకోవాల్సి ఉంటుందని సూచించారు. కలలను సాకారం చేసుకునే క్రమంలో సమయం, ధనం, వ్యక్తిగత సౌకర్యాలు, కుటుంబంతో గడిపే సమయాన్ని సైతం త్యాగం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. విజయానికి కోరికల నియంత్రణ ప్రధాన మూలస్తంభమని, తాత్కాలిక ఆనందాల కంటే దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించే "డిలేడ్ గ్రాటిఫికేషన్" విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. విమర్శలు, అపజయాలు, ప్రతికూల పరిస్థితులను అధిగమించే మానసిక స్థైర్యం ఉన్నవారే దీర్ఘకాలిక విజయాలను సాధిస్తారని వివరించారు. ప్రతిభ ఉన్నప్పటికీ అనేక మంది ఆశించిన స్థాయికి చేరుకోలేకపోవడానికి అవాస్తవిక అంచనాలు, భావోద్వేగ అస్థిరత, త్వరిత విజయాలపై మోజు వంటి మానసిక కారణాలే ప్రధానమని రాజ్ ఆచార్య విశ్లేషించారు. పరిశ్రమలోని పోటీని తట్టుకోలేకపోవడం, విమర్శలను స్వీకరించలేకపోవడం కూడా వెనుకబడటానికి కారణమవుతుందని తెలిపారు. సినీ రంగంలో అవకాశాల అనిశ్చితి కారణంగా కొందరు తీవ్ర ఆందోళన, నిరాశ, అభద్రతా భావాలకు గురవుతారని, మరికొందరు ఒత్తిడి నుంచి బయటపడేందుకు వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఇటువంటి పరిస్థితులు వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు ఉద్వేగ నిరోధకత, కఠోర క్రమశిక్షణ, నిరంతర ఆత్మ పరిశీలనను అలవర్చుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడి అధికమైనప్పుడు సంకోచించకుండా నిపుణులైన సైకాలజిస్టుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. లక్ష్యాలకు అనుగుణంగా ఆలోచనలు, అలవాట్లు, జీవన విధానాన్ని మార్చుకునే వారే విజయాన్ని అందుకుంటారని, మార్పును స్వీకరించడం వ్యక్తిగత వికాసానికి మూలాధారమని రాజ్ ఆచార్య పేర్కొన్నారు. సరైన మానసిక దృక్పథం కలిగిన వారు సినీ రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ విశేష విజయాలు సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కారిస్తాం : డిసి మల్లయ్య


ప్రజావాణికి ఒక ఫిర్యాదు రావడం జరిగిందని ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని అన్నారు.

అత్తాపూర్ జూన్1 ,ప్రభాతవార్త : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య పేర్కొన్నారు. సోమవారం అత్తాపూర్ సర్కిల్ కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిసి మల్లయ్య ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ


ఉప్పల్ సర్కిల్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్‌సి రాధిక గుప్తా, డిసి శైలజ తదితరులు

**ఉప్పల్, జూన్ 1 ప్రభాతవార్త :** ఉప్పల్ జోన్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించామని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పల్ జోనల్ పరిధిలోని పలు సర్కిళ్ల నుంచి సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించామని, ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ 7, ఇంజనీరింగ్ 4, రెవెన్యూ 02 మొత్తం 13 ధరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ప్రజల నుంచిఅందిన ప్రతి వినతిపత్రాన్ని నమోదు చేసి, సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యల కోసం పంపించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసి శైలజ, ఎస్ఐ హరికిషోర్, సిపి కృష్ణ మోహన్ జోన్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఆర్‌టివోగా సురేష్ రెడ్డి బాధ్యతలు


ఉప్పల్ ఆర్‌టివోగా బాధ్యతలు స్వీకరిస్తున్న మందాడి సురేష్‌రెడ్డి దృశ్యం.

**ఉప్పల్, జూన్ 1 ప్రభాతవార్త :** ఉప్పల్ ఆర్‌టివోగా మందాడి సురేష్‌రెడ్డి నియమితులైయ్యారు. ఇక్కడ ఇంచార్జీగా పనిచేస్తున్న రవీందర్‌గౌడ్ స్థానంలో కొత్త ఆర్‌టివోగా సురేష్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మందాడి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ఆర్‌టివో పరిధిలో ప్రజలు తమ సమస్యలను నేరుగా కలిసి ఫిర్యాదు చేయాలని కోరారు. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు కౌంటర్‌లో నేరుగా కలిసి పనులు చేయించుకోవాలని కోరారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు. ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే


మలక్ పేట ఆర్ యుబీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఎసీపీ చంద్రకుమార్, ఇన్ స్పెక్టర్ భాస్కర్ తదితరులు

**మలక్ పేట, జూన్ 1, ప్రభాతవార్త:** రానున్న వర్షాకాలం మూలంగా ట్రాఫిక్ కు అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సౌత్ జోన్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో సౌత్ జోన్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఏసీపీ చంద్రకుమార్, ఇన్ స్పెక్టర్ భాస్కర్ తదితరులు జిహెచ్ఎంసి అధికారులు సిబ్బందితో కలిసి మలక్ పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వర్షపు నీరు నిలిచిపోయే ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. మలక్ పేట్ రైల్వే అండర్ బ్రిడ్జి, అక్షయ్ హోటల్, మార్కెట్ మెట్రో స్టేషన్, ముసారాంబాగ్ మూసి నది బ్రిడ్జి తదితర ప్రాంతాలను వారు పరిశీలించారు. రానున్న వర్షాకాలం మూలంగా వర్షపు నీరు నిలిచిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో బిఆర్ఎస్ నేత, కాలనీవాసుల చేరిక


తులసి ముఖేష్ ముదిరాజ్ సమక్షంలో అందెల సమక్షంలో బిజెపిలో చేరిన మేకల కృష్ణ తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ సెక్టార్–2 పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు, కాలనీలవాసులు బిజెపిలో చేరారు. సెక్టార్ బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకుడు మేకల కృష్ణతో పాటు బొమ్మరబోయిన లింగస్వామి, ఎం.సత్యనారాయణ, మెరుగు శంకర్, పి.రవికుమార్, చింతపల్లి శ్రీనివాస్, గోవింద్ శ్రీనివాస్, బొమ్మరబోయిన శ్రీనివాస్, సత్తు రమేష్, బండి వెంకటేష్, నీళ్ళ మల్లయ్య, పాలకూర మహేష్, కనుగుల వెంకటేష్, గుండూరి సైదులు, చింతపల్లి సిద్దార్థ్, కిరణ్ తదితరులు బిజెపిలో చేరారు. వీరంతా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి అందెల ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపికి చెందిన నీలా రవినాయక్, విజయలక్ష్మి రాజు ముదిరాజ్, సిద్దాల శ్రీనివాస్, సూల ప్రభాకర్, తులసి వెంకటేశ్వర్లు, కిశోర్, తుమ్మల రమేష్, జగన్ ముదిరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐ వర్క్‌ఫ్లో మేనేజ్‌మెంట్‌కు తెలంగాణ విద్యార్థి పేటెంట్


యెరువ వరుణ్ అనీష్‌రెడ్డి ( ఫైల్ ఫోటో)

**ఉప్పల్, జూన్ 1 ప్రభాతవార్త :** ఎఐ ఆధారిత వర్క్‌ఫ్లో మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు తెలంగాణకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పేటెంట్ సాధించారు. అమెరికాలోని అమెజాన్ సంస్థలో ఐటీ ప్రొఫెషనల్‌గా పనిచేస్తున్న వరుణ్ అనీష్ రెడ్డి యెరువ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో విశిష్ట ఘనత సాధించారు. తెలంగాణకు చెందిన విజయ్ కుమార్ రెడ్డి యెరువ, జయంతి రెడ్డి దంపతుల కుమారుడైన వరుణ్ అనీష్ రెడ్డి యెరువ నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గచ్చిబౌలిలో పాఠశాల విద్యను పూర్తి చేశారు. అనంతరం గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నుండి ఇంజినీరింగ్ పట్టా పొందారు. తర్వాత అమెరికాలోని నార్తర్న్ ఇల్లినాయిస్ యూనివర్సిటీ, డీకాల్బ్ నుండి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీని సంపాదించారు. ఈ పేటెంట్‌లో ప్రతిపాదించిన ఆవిష్కరణ, డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ వాతావరణాల్లో వర్క్‌ఫ్లో నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడానికి రూపొందించబడిన ఒక ఆధునిక వర్క్‌ఫ్లో ఎగ్జిక్యూషన్ కంట్రోల్ సిస్టమ్. ఆయన సాధించిన ఈ ఘనత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలవడమే కాకుండా, యువ ఇంజినీర్లు, పరిశోధకులు మరియు ఆవిష్కర్తలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ఈ విశిష్ట విజయాన్ని సాధించిన వరుణ్ అనీష్ రెడ్డి పలువురు అభినందించారు.

## జయేష్ రంజన్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి జూన్ 1, ప్రభాతవార్తః** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌ని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆమోదం పొందిన అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. బండ చెరువు అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్ల నిధులు, మౌలాలి భరత్‌నగర్‌లో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం కోసం రూ.10.42 కోట్ల నిధులు.. నేరేడ్మెట్ డిఫెన్స్ కాలనీలో స్పోర్ట్స్ ఫెసిలిటీస్ అభివృద్ధి కోసం రూ.6.89 కోట్ల నిధులు.. నేరేడ్మెట్ ఆర్‌కే పురం డివిజన్‌లో ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం మరియు పిక్‌బాల్ కోర్టు నిర్మాణం కోసం రూ. 16.13 కోట్ల నిధులుఅదేవిధంగా, బండ చెరువు అభివృద్ధి పనులకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసులను ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు అమలుకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఐఏఎస్ ఎమ్మెల్యే సమర్పించిన వినతి పత్రంపై సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మురుగేష్, చిన్న యాదవ్, బాబురావు, జంగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్డు,ర్యాంపు పనులు త్వరగా పూర్తి చేయాలి

**-రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**



**అత్తాపూర్ జూన్1 ,ప్రభాతవార్త :** పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జోనల్ కమిషనరల్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూ పార్కు వరకు ఫ్లై ఓవర్ కింద ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్డును రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారుల బృందం తో కలిసి పర్యవేక్షించినారు. ఫ్లై ఓవర్ కింద ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్డును, ర్యాంపు పనులను త్వరితగతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, యూబీడీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో బిజెవైఎం రాష్ట్ర నూతన కార్యవర్గం పూజలు


చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అమ్మ వారికి పూజలు నిర్వహిస్తున్న బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే, నూతన కార్యవర్గం ప్రతినిధులు

**చార్మినార్,జూన్ 1 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో సోమవారం బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే ఆధ్వర్యంలో నూతన పదాధికారులు కలిసి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాబిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో బిజెవైఎంను మరింత బలోపేతం చేయటంతో పాటు గ్రామ స్థాయి వరకు విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. యువత సమస్యలపై బీజేవైఎం నిరంతరం పోరాటం చేస్తామని ఆయన తెలియజేశారు. ప్రజా సమస్యలపై పోరాట కార్యక్రమాలను నిర్వహించనున్నామని బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.హరీశ్వర్ రెడ్డి, ఎం.యశస్వి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సందీప్ గౌడ్, నితిన్, నందకర్, అనిత రెడ్డి, సాయినాథ్, రాష్ట్ర కార్యదర్శులు అల్లి శివ చంద్రగిరి, చింతకాయల ఘూన్సీ, అరవింద్ రెడ్డి, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వస్త్రాల వ్యాపారి ఆత్మహత్య

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 1 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వస్త్రాల వ్యాపారి ఇంట్లో ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం..లక్ష్మీగూడకు చెందిన సాయిలు, మౌనిక (29)కు పది సంవత్సరాలు క్రితం వివాహం జరిగింది. సాయిలువస్త్రాల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలం నుంచి సాయిలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. వస్త్రాల వ్యాపారం సరిగ్గా నడవక పోవటంతో అప్పుల పాలయ్యాడు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో బెడ్ రూంలోని ఇనుప రాడ్‌కు సున్నీతో భర్త సాయిలు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.